# సాక్షి ములుగు

గురువారం । 20 । జూన్ । 2024






**కేటుగాళ్ల బరితెగింపు..** - 8లో▸

సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు. రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం, పోలీసు శాఖ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా వాటిని అరికట్టలేకపోతున్నాయి.



**'చేతి' మరక వదిలిస్తారా?**

టీజీఎస్ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో అకౌంట్స్ విభాగపు ప్రధాన అధికారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై యాజమాన్యం విచారణకు ఆదేశించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం

35.1° /28.2°

**వాతావరణం**

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



**ములుగు:** సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ టీఎస్.దివాకర సూచించారు. మండల పరిధిలోని బండారుపల్లి పరిధిలో 16ఎకరాల విస్తీర్ణంలో రూ. 47కోట్లతో నిర్మిస్తున్న కలెక్టరేట్ పనులను బుధవారం అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి పరిశీలించారు. నిర్మాణ ఆకృతి, బ్లూ ప్రింట్‌లను పరిశీలించారు. సంబంధిత పనుల కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి భవన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో నిర్మాణ పనులకు అంతరాయం కలిగితే అంతర్గత పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పనుల పురోగతిని రోజువారీగా అందించాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. కలెక్టర్ వెంట డీఈ వెంకటరమణ, ఏఈ రాకేష్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రెయినీ ఐపీఎస్‌లకు శిక్షణ



**గోవిందరావుపేట:** తెలంగాణకు చెందిన ట్రెయినీ ఐపీఎస్‌లు శిక్షణలో భాగంగా బెటాలియన్ అడ్మినిస్ట్రేషన్, ఫంక్షనింగ్‌పై ఒక్క రోజు ప్రాక్టికల్ ట్రెనింగ్ నిమిత్తం మండల కేంద్రంలోని 5వ బెటాలియన్‌ను 9మంది ఐపీఎస్ అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమాండెంట్ శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్ కుమార్, వేణు గోపాల్ రెడ్డిలు ట్రెయినీ ఐపీఎస్‌లకు బెటాలియన్ అడ్మినిస్ట్రేషన్, ఫంక్షనింగ్, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కార్తీక్, అన్నయ్య, రాంప్రసాద్, సల్మాన్ రాజు, శ్రీనివాస్, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

### రామప్పలో ట్రెయినీ ఐఏఎస్‌ల పూజలు



**వెంకటాపురం(ఎం):** మండల పరిధిలోని పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని ఐఏఎస్ అధికారులు బుధవారం సందర్శించి దర్శించుకున్నారు. అజ్మీరా సంకేత్‌కుమార్, ఉమా హారతి, గరీమానరులా, అభిగ్యాన్ మాల్వియా, అజయ్ యాదవ్, మ్రినల్ శేష్టా, ఈఎస్ఎస్‌డీమనోజ్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్‌లు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి శేషవస్త్రాలను, ఆశీర్వచనం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రామప్ప శిల్పకళ అద్భుతంగా ఉందని కొనియాడారు. వారి వెంట ప్రొఫెసర్ శ్రీనివాస్, టీఎస్‌టీడీసీ మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాసరావు, రవి, ఆర్ఐ రమేష్, టూరిజం. దేవాదాయ అధికారులు ఉన్నారు.

### చట్టాలపై అవగాహన తప్పనిసరి

**ములుగు రూరల్:** విద్యార్థులు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సన్ రైజర్స్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయం, మోటర్ వెహికిల్ చట్టం, పోక్సో చట్టాలు, బాలలకు సంబంధించిన హక్కులను వివరించారు.

కొండాయి బ్రిడ్జికి అనుసంధానంగా చేస్తున్న ఐరన్ బ్రిడ్జి



# శరవేగంగా..

**కొండాయి జంపన్నవాగుపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు**

- ఐటీడీఏ నుంచి రూ.35లక్షలు మంజూరు
- తీరనున్న ఆయా గ్రామాల ప్రజల కష్టాలు

**ఏటూరునాగారం:** మండల పరిధిలోని కొండాయి సమీపంలోని జంపన్నవాగుపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ వర్షాకాలంలో ముంపు ప్రాంతాల ప్రజలు ఈ ఐరన్ బ్రిడ్జి నుంచి నడిచేందుకు కావాల్సిన నిర్మాణం పనులను మొదలు పెట్టారు. మంత్రి సీతక్క చొరవతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు ఊపందుకున్నాయి.

**మంత్రి చొరవతోనే పనులు**

మండలంలోని కొండాయి – దొడ్ల గ్రామాల మధ్యలోని జంపన్నవాగుపై 2015లో రూ.5కోట్లతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి గతేడాది కురిసిన వర్షాలు, వరదల తాకిడికి కొట్టుకుపోయింది. దీంతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం గ్రామాల ప్రజలకు రాకపోకలు కష్టంగా మారడంతో అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.25 లక్షలతో ఆర్అండ్‌బీశాఖ ద్వారా తాత్కాలికంగా వాగుపై సిమెంట్ పైపులు వేసి మట్టిరోడ్డును నిర్మించారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు మట్టి అంతా ఒర్లిపోయి పైపులు కొట్టుకపోయే ప్రమాదం ఏర్పడింది. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా బ్రిడ్జి పైనుంచి ఐరన్ బ్రిడ్జి(ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్మించడానికి మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించడంతోనే ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఇంజనీరింగ్‌శాఖ ద్వారా రూ. 35లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఐరన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను మొదలు పెట్టారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ఉండేందుకు ప్రజలకు సురక్షితమైన రవాణా ఉండాలనే లక్ష్యంతో ఈ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు.

**280 అడుగుల పొడుగు.. 4 అడుగుల వెడల్పు**

ఫుట్ ఓవర్ బ్రిడ్జిని 280 అడుగుల పొడువు, నాలుగు అడుగుల వెడల్పు నిడివితో నిర్మిస్తున్నారు. అయితే టేకుమండలంలో గతంలో బ్రిడ్జి కూలిపోతే అక్కడ ఐరన్ బ్రిడ్జిని నిర్మించడంతో దాని నమూనాలోనే ఇక్కడ నిర్మించేలా చర్యలు చేపట్టారు. జంపన్నవాగు బ్రిడ్జికి ఉన్న రెండు పిల్లర్ల స్థానంలో రెండు ఐరన్ పిల్లర్లను నిర్మించి దానిపై నుంచి ఈ ఐరన్ బ్రిడ్జిని వెల్డింగ్ చేసి నిర్మిస్తున్నారు. కొట్టుకపోయిన బ్రిడ్జి స్థానంలో ఈ ఐరన్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు.

**పనులను పరిశీలించిన అధికారులు**

కొండాయి వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను ఐటీడీఏ ఈఈ వీరభద్రం, డీఈఈ చందర్‌లు బుధవారం పరిశీలించారు. వెల్డింగ్ పనులు సకాలంలో పూర్తి చేసి మరో రెండు రోజుల్లో బ్రిడ్జి వినియోగంలోకి వచ్చేలా చూస్తామన్నారు. ఈ బ్రిడ్జి నుంచి ముంపు ప్రాంతాల ప్రజలు వాగు వచ్చినప్పటికి దాటేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే దాటాలన్నారు. వరదల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా రాకపోకలకు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. త్రీ, ఫోర్ వీటర్లకు ఎలాంటి అనుమతి లేదన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఈఈ వీరభద్రం, డీఈఈ చందర్





ఐరన్ ఫుట్‌పాత్‌కు వెల్డింగ్ చేస్తున్న వెల్డర్స్

**తాత్కాలికంగా రాకపోకలకు ఉపయోగపడేలా..**

శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 9.50 కోట్లు ఆర్అండ్‌బీశాఖ ద్వారా మంజూరు ఇచ్చింది. మార్చి నెలలో సైతం పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే శాశ్వత నిర్మాణం బ్రిడ్జి పనులు మొదలయ్యే వరకు తాత్కాలికంగా ఈ ఐరన్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రజలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఉపయోగించేలా నిర్మిస్తున్నారు. ఇరువైపులా గైడింగ్ ఐరన్ వాల్స్, నడిచేందుకు ఐరన్ షీట్స్‌ను వెల్డింగ్ చేయడంతో దానిపై సులభంగా నడిచే అవకాశం ఉంటుంది. వర్షాలు కురిసి వాగు ఉప్పొంగినప్పటికీ రాకపోకలకు ఎలాంటి అవంతరాలు లేకుండా ఉండేలా, రాత్రి వేళలో సైతం ఈ బ్రిడ్జి పైనుంచి నడిచేలా నిర్మిస్తున్నారు.

# పదోన్నతుల కల నెరవేరిన వేళ..

**ఐదు జిల్లాల్లో 1,768మంది టీచర్లకు పదోన్నతులు**

- ఉత్తర్వులు చేతికందడంతో పలువురు విధుల్లో చేరిక
- ఎస్ఏ పీడీలుగా పీఈటీలు, లాంగ్వేజ్ పండిట్లకు ఎస్ఏలుగా, ఎస్‌జీటీలకు పీఎస్‌హెచ్ఎంలు, ఎస్ఏలుగా ఉద్యోగోన్నతి
- వరంగల్‌లో మరో 76మంది, ములుగులో 54మంది వెయిటింగ్

**విద్యారణ్యపురి:** దశాబ్దంన్నర కాలంగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న ప్రభుత్వ, లోకల్‌బాడీ యాజమాన్యాల పరిధిలోని లాంగ్వేజ్ పండిట్ల(తెలుగు, హిందీ, ఉర్దూ)కు స్కూల్ అసిస్టెంట్‌లుగా, పీఈటీలు ఎస్ఏ పీడీలుగా ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. వీరికి బుధవారం ఉత్తర్వులు ఇవ్వండంతో పోస్టింగ్ స్థానాల్లో జాయిన్ అవుతున్నారు. తొమ్మిదేళ్లుగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)కు కూడా పదోన్నతులు లభించాయి. వీరికి పీఎస్‌హెచ్ఎంలుగా, ఎస్ఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, మ్యాథ్స్, బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, కేటగిరీలో పదోన్నతులు కల్పించారు. మల్టీజోన్ -1 పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ప్రభుత్వ, లోకల్ బాడీ యాజమాన్యాల పరిధిలో అన్ని కేటగిరీలు కలిపి 1,768మందికి పదోన్నతులు కల్పించారు.

**జిల్లాల వారీగా ఇలా..**

- హనుమకొండ జిల్లాలో 454మంది పదోన్నతులు పొందారు. వరంగల్ జిల్లాలో 434మంది పదోన్నతులు పొందాల్సిండగా. అందులో లోకల్‌బాడీలో పీఎస్‌హెచ్ఎం, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లు, ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ పీడీలు మొత్తంగా 76మందికి పదోన్నతులు ఉత్తర్వులు రావాల్సింది. రోస్టర్‌లో తలెత్తిన సమస్యతో మళ్లీ పరిశీలించినట్లు సమాచారం. వీరికి ఆర్డర్స్ రావాల్సింది. రాత్రి వరకు వీరికి కూడా పదోన్నతుల ఆర్డర్స్ వస్తాయని భావిస్తున్నారు. మిగతా 358మందికి ఉత్తర్వులు అందాయి.



- ములుగు జిల్లాలో 217మందికి పదోన్నతులు కల్పించగా 163మందికి ఉత్తర్వులు అందాయి. పీఎస్‌హెచ్ఎం 39మందికి, ఎస్ఏ ఇంగ్లిష్ 15మంది.. మొత్తంగా 54మంది టీచర్లకు ఉత్తర్వులు రావాల్సింది.
- మహబూబాబాద్ జిల్లాలో 517మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 276మంది పదోన్నతులు పొందారు.
- ఎక్కువశాతం మంది పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తమకు వెబ్ ఆప్షన్ల ప్రకారం కేటాయించిన ఉన్నత పాఠశాలలు, అక్కడక్కడా యూపీఎస్‌లలో విధుల్లో చేరారు.

**కొందరు ఎస్‌జీటీలకు రెండింటిల్లోనూ పదోన్నతులు**

ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు జిల్లాలో కొందరు ఎస్‌జీటీలకు రెండింటిల్లోనూ పదోన్నతులు లభించినట్లు సమాచారం. ఎస్‌జీటీ కేడర్‌లోని వారికి పీఎస్‌హెచ్ఎంలుగా, విద్యార్హతలను బట్టి ఇతర సబ్జెక్టుల్లో స్కూల్‌అసిస్టెంట్లుగా కూడా పదోన్నతి పొందే అవకాశం ఉంది. దీంతో హనుమకొండ జిల్లాలో అలా రెండు పోస్టుల్లోనూ పదోన్నతి పొందిన వారు 50మంది వరకు, మహబూబాబాద్ జిల్లాలో 30మంది వరకు ఉంటారని తెలుస్తోంది. వరంగల్ జిల్లాలో ఒక టీచర్‌కు మాత్రం రెండు సబ్జెక్టుల్లో ఎస్ఏలుగా పదోన్నతి లభించినట్లు తెలిసింది. మిగతా జిల్లాల్లోనూ పలువురు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. వీరు ఏదో ఒక పోస్టులో విధుల్లో చేరితే మిగతా పోస్టు ఖాళీగా ఉంటుంది.

**ములుగు జిల్లాలో 247మందివరకు అవకాశం ఉన్నా..**

ములుగు జిల్లాలో 247 మంది టీచర్లకు పదోన్నతి అవకాశం ఉన్నప్పటికి అర్హులైనవారు లేకపోవడం వల్ల 217మందికే లభించినట్లు ప్రాథమిక సమాచారం. ఇదిలా ఉండగా జనగామ జిల్లా మల్టీజోన్ -2 పరిధిలో ఉండడంతో అక్కడ ఆ జోన్‌తోపాటు జరుగుతాయని విద్యాశాఖాధికారులు తెలిపారు.

# సికిల్‌సెల్ వ్యాధిని నిర్మూలిద్దాం..



వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకుంటున్న మంత్రి



పైపులైన్ నిర్మాణం పనులను ప్రారంభిస్తూ..

మంత్రి సీతక్క

**ములుగు:** సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిని సమాజం నుంచి నిర్మూలిద్దామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు వరల్డ్ సికిల్‌సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సికిల్‌సెల్ సోకితే రక్తకణాలు చనిపోతాయని, శరీరం నీరసంగా మారి జ్వర తీవ్రత ఉంటుందన్నారు. ముఖ్యంగా రక్తమార్పిడి కష్టతరంగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్‌లో ఈ వ్యాధితో ఎవరు చనిపోకుండా చూడాలన్నారు. పాజిటివ్ వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. జిల్లాలో వెంకటాపురం(కె), వాజేడు మండలాల్లో వ్యాధి తీవ్రత ఉంటున్నట్లుగా వైద్య సిబ్బంది గుర్తించారని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధిగా రోగ నిర్ధారణ శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ చిన్నదానికి రోగులను వరంగల్‌కు రెఫర్ చేయడం మానుకోవాలని సూచించారు. ఇకపై ఎప్పుడూ వైద్యశాలలో వైద్యులు లేరని వార్తలు రాకుండా చూసుకోవాలన్నారు. సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది సమస్యలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని సమయానుకూలంగా పరిష్కరిస్తామని వెల్లడించారు. కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ యుక్తవయసులో ఉన్న బాలికలకు ఎక్కువగా ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. జిల్లాలో 2,300 మందికి టెస్టులు నిర్వహించగా 20 మందికి పాజిటీవ్ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా సికిల్‌సెల్ టెస్టు చేయించుకున్నారు. ప్రతిఒక్కరూ టెస్టులకు ముందుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, డీఎంహెచ్ఓ అప్పయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్, జిల్లా ప్రోగ్రాం అధికారి రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలి**

**వెంకటాపురం(ఎం):** ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలని మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో రూ.49.53 లక్షల నాబార్డ్ నిధులతో చేపట్టిన మిషన్ భగీరథ అంతర్గత తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను సీతక్క, కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీటి పైపులైన్‌లు లీకేజీ కావడంతో ప్రజలు కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలు అవుతున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తమై పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. వెంకటాపురంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న గృహాలకు నల్లాల కలెక్షన్ లేకపోవడంతో నిధులను కేటాయించి పైపులైన్ నిర్మాణం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నూతన గృహాలకు భగీరథ నీటిని అందించాలని మంత్రి చొరవతోనే పైపులైన్ నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశ్, డీఈ అజహర్ సయ్యద్, ఎంపీపీ రజిత, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల-3వ దశకు మరో రూ.550కోట్లు

**అవసరమని మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు**

- రెండున్నర నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేయాలని మంత్రి ఆదేశం
- వేర్వేరుగా మైనర్, మేజర్ ఇరిగేషన్ చేయాలన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- నగరంలో ముంపునకు గురి కాకుండా నాలాల అభివృద్ధికి దిశానిర్దేశం
- నీటిపారుదలపై హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం



సమీక్షలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

**హసన్‌పర్తి:** మరో రూ.550కోట్లు విడుదల చేస్తే దేవాదుల ప్రాజెక్టు-3వ దశ పనులు పూర్తవుతాయని ఇరిగేషన్ అధికారులు.. రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సారెస్పీ, దేవాదుల ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమావేశం హైదరాబాద్‌లో జలసౌధలో మంగళవారం రాత్రి జరిగింది. సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. దేవాదుల ప్రాజెక్టు-3పై జరిగిన చర్చ సందర్భంగా పలు అంశాలు ప్రస్తావించారు. ప్రస్తుతం దేవాదుల ప్రాజెక్టు-3దశ పనులు 90శాతం పూర్తయినట్లు మంత్రి ఉత్తమ్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. కాంక్రీట్‌తోపాటు ఇతర పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు నిధులు మంజూరు చేస్తే ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. డిస్ట్రిబ్యూటరీ, కాల్వలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. 1.5లక్షల ఎకరాలకు నీరు అందించగలమని అధికారులు మంత్రికి వివరించారు. ఈ అంశంపై ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి సూచించారు. రెండున్నర నెలల్లోనే దేవాదుల-3 దశ ద్వారా నీరు అందించాలని ఆదేశించారు.

**నీటి కేటాయింపుల్లో కుదింపు**

చర్చ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మాట్లాడారు. గతంలో దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం 60 టీఎంసీల నీటి కేటాయింపు జరిగిందన్నారు. ప్రస్తుతం దాన్ని 38.15 టీఎంసీలకు కుదించారని తెలిపారు. దేవాదుల-1, 2, 3 దశల్లో నీటిని లిఫ్ట్ చేయడానికి 38.16 టీఎంసీలు సరిపోవన్నారు. కేటాయింపులు పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు-2లో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్ వరకు 31 కిలోమీటర్ల వరకు ప్రధాన కాల్వ మంజూరైనట్లు వివరించారు. దీనిద్వారా స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ కింద 28,.800ఎకరాలు, చెన్నూరు రిజర్వాయర్ కింద 25,200 ఎకరాలు, నవాబుపేట రిజర్వాయర్ కింద 53,400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. నవాబుపేట రిజర్వాయర్ ద్వారా స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లోని 1,07,400 ఎకరాలకు సాగునీరు అందించడానికి శాశ్వత ప్రాతిపదికన ప్రధాన కాల్వలకు ఇరువైపులా లైనింగ్, పూడిక తొలగింపు, జంగిల్ క్లియరెన్స్, ఓటీలు, డీఎల్ఆర్ బిల్లు, తూములు, షట్టర్ల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పాత పద్ధతి ప్రకారమే మైనర్, మేజర్ ఇరిగేషన్‌లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. రైతులకు కూడా తగిన విధంగా ప్రయోజనం కలుగుతుందన్నారు.

**నాలాల అభివృద్ధికి రూ.140 కోట్లు**

గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో నాలాల అభివృద్ధికి రూ.140 కోట్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వర్షాకాలంలో నగరంలోని కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రకాళి చెరువుతోపాటు ఇతర చెరువుల నాలాలను అభివృద్ధి చేయాల్సిన అవసర ఉందన్నారు.

**కాల్వల పనులు చేపట్టాలి**

పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ పనులు వెంటనే చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టులోని పలు ప్రాంతాల్లో ప్రధాన కాల్వలు, ఉపకాల్వలు దెబ్బతిన్నాయని మంత్రి చెప్పా రు. మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. గతేడాది దెబ్బతిన్న కాల్వలు, చెరువుల నివేదికను వెంటనే అందించాలన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, రాంచందర్‌నాయక్, మురళీనాయక్, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయ క్, ఈఎన్‌సీలు నాగేందర్, అనిల్‌కుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాలను సందర్శించిన అధికారులు

**మంగపేట:** మండల కేంద్రంలోని వరద ముంపు ప్రాంతాలను మండల స్పెషలాఫీసర్ తుల రవి ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం సందర్శించింది. వర్షాకాలంలో గోదావరి వరదలు, గౌరారం వాగు వరద ఉధృతి కారణంగా మండల కేంద్రంలో ప్రతిఏటా లోతట్టు ముంపు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 15న సాక్షిలో పొంచి ఉన్న ప్రళయం శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ముంపు ప్రాంతాలైన పొదుమూరు, సినిమాహాల్ వీధి, మంగపేట, బోరునర్సాపురం మధ్య నూతనంగా నిర్మించిన లోలెవల్ బ్రిడ్జిని వారు పరిశీలించారు. గత ఏడాది గౌరారంవాగు వరదకు ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వచ్చి లోలెవల్ బ్రిడ్జి పిల్లర్లకు అడ్డుపడిన అవశేషాలు గుర్తించారు. వాటిని తొలగిస్తే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద దిగువ ప్రాంతానికి ప్రవహిస్తుందని లేని పక్షంలో వాగు వరద నీటితో పాటు గోదావరి బ్యాక్ వాటర్‌తో సినిమాహాల్ వీధిలోని 28ఇళ్లతో పాటు పొదుమూరులోని లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాలు సైతం మునిగే ప్రమాదం ఉందని గుర్తించారు. ముందస్తుగా చర్యలు చేపట్టేందుకు రూ. లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. అనంతరం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకధికారులతో సమావేశం నిర్వహించారు. ముందస్తుగా చర్యలు చేపట్టాలని, వరదల పట్ల అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పెషలాఫీసర్ రవి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఆర్అండ్‌బీ డీఈ రఘువీర్, ఐబీ ఏఈ వలీమ్ మహ్మద్, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకధికారులు పాల్గొన్నారు.



పొదుమూరులోని వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

### కలెక్టర్‌ను కలిసిన పూజారులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న పూజారులు

**ములుగు రూరల్:** ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ టీఎస్.దివాకరను గట్టమ్మ ఆలయ పూజారులు, ఆదివాసీ నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అమ్మవారి ప్రసాదం, పసుపు-కుంకుమలు అందించారు. గట్టమ్మ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్య, రాజు, రవి, మల్లయ్య పాల్గొన్నారు.



### జాలువారుతున్న బొగత

మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతం జాలువారుతోంది. గత కొంత కాలంగా వెలవెల బోయిన బొగత జలపాతం మంగళ వారం కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా రావడంతో బొగత జలపాతం జాలువారుతోంది. దీంతో జలధారలు కనువిందు చేస్తున్నాయి. – వాజేడు

## క్లుప్తంగా

### ఆడుకుంటూ అనంతలోకాలకు..

- ట్రాక్టర్ కిందపడి చిన్నారి మృతి
- మట్టివాడలో ఘటన


మోహనశ్రీ(ఫైల్)

గూడూరు: ఓ చిన్నారి ఆడుకుంటూ అనంత లోకాలకు చేరింది. ట్రాక్టర్ కింద పడి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని మట్టివాడలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేడ జయంత్ ఇంటి ఎదుట ట్రాక్టర్ నిలిపి డ్రైవర్ పక్కకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడే ఆడుకుంటున్న మేడ జయంత్ కూతురు మోహనశ్రీ (3) ట్రాక్టర్ వద్దకు వెళ్లి క్లచ్ రాడ్ పట్టుకుని నిలబడింది. దీంతో ట్రాక్టర్ కదలడంతో టైర్ కింద పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే గుర్తించిన తల్లిదండ్రులు మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై జయంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

### ప్రాణం తీసిన వివాహేతర సంబంధం..

- ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య
- జగ్గయ్యపేటలో ఘటన


కోమల (ఫైల్)

తరిగొప్పుల: భర్త వివాహేతర సంబంధాన్ని తట్టుకోలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల కేంద్రం శివారు జగ్గయ్యపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగ్గయ్యపేటకు చెందిన ఆవుల కోమల(34).. తన భర్త శ్యామ్ వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తనను ప్రేమగా చూసుకోవడం లేదని కొంతకాలంగా మనస్తాపం చెందుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం తెల్లవారుజామున ఇంటికి సమీపంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అదే గ్రామానికి చెందిన పరమని బాలయ్య ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్తుండగా కోమల వేలాడుతూ కనిపించింది. దీంతో బాలయ్య చుట్టుపక్కల ఉన్న వారిని పిలిచాడు. స్థానికులు వచ్చి చూడగా కోమల అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి బత్తుల కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

### మనస్తాపంతో శివనగర్‌లో యువకుడు..

ఖిలా వరంగల్: పెళ్లి కావడం లేదని, ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తీర్చే పరిస్థితి లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ శివనగర్‌లోని ఏసీరెడ్డినగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కోమరాజు జంపయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు శివ (33) ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల బ్యాంకులో అప్పు తీసుకుని ఇల్లు నిర్మించాడు. ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తీర్చే పరిస్థితి లేక, పెళ్లి కూడా కావడం లేదని మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడు తండ్రి జంపయ్య వెంటనే మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందజేయగా .. వివరాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. జంపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు.



# ‘చేతి’ మరక వదిలిస్తారా?

## ఆర్టీసీలో అధికారి చేతివాటంపై శాఖాపరమైన విచారణ



- నదరు అధికారి అవినీతిపై ఇప్పటికే విచారణ చేసి ఆర్టీసీ విజిలెన్స్
- గుట్టుగా విచారణ అధికారుల వివరాలు

హన్మకొండ : టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో అకౌంట్స్ విభాగపు ప్రధాన అధికారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై యాజమాన్యం శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. ‘ఆర్టీసీ అధికారి చేతి వాటం’, ‘సాక్ష్యం చెప్పొద్దు’ అనే శీర్షికలతో ‘సాక్షి’లో మార్చి 24, 31 తేదీల్లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి నివేదికను యాజమాన్యానికి అందించారు. తర్వాత సమగ్ర విచారణ కోసం శాఖపరమైన విచారణకు ఆదేశించిన యాజమాన్యం.. సీనియర్ అకౌంట్స్ అధికారితో కమిటీ వేశారు. ఈ కమిటీ విచారణ ప్రారంభించినట్లు సమాచారం. కాగా, అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడొచ్చు కానీ విచారణ అధికారుల వివరాలు మాత్రం బయటకు వెల్లడించొద్దనే ధోరణిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచారణ ఎవరు చేస్తున్నారో స్పష్టంగా తెలియకపోతే ఎంక్వైరీ పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరుగుతుందని ఎలా నమ్మాలనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**బిల్లు ఇచ్చేందుకు డబ్బు డిమాండ్..**

వరంగల్ రీజియన్ కార్యాలయంలో అద్దె బస్సుల యాజమానులకు పెరిగిన కిలో మీటర్లకు బిల్లు ఇచ్చేందుకు అకౌంట్స్ విభాగం ప్రధాన అధికారి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆర్టీసీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 2009లో అద్దె బస్సులకు టెండర్లు పిలిచారు. ఇందులో ఈ బస్సులు హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్లి, తిరిగి హనుమకొండకు చేరుకుని ఇక్కడి నుంచి వేములవాడకు వెళ్లాలి. అయితే ఆ తర్వాత హైదరాబాద్ ట్రిప్పు క్యాన్సల్ చేసి రెండు ట్రిప్పులు వేములవాడకు తిప్పారు. హైదరాబాద్‌తో చూస్తే వేములవాడ దూరం ఎక్కువగా ఉంటుంది. అయితే బిల్లులు మాత్రం హైదరాబాద్ ఒక ట్రిప్పు, వేములవాడ ఒక ట్రిప్పు చెల్లించుకుంటూ వచ్చారు.

**ఉద్యోగానికి ఎసరు వస్తుందని నాయకులతో మధ్యవర్తిత్వం**

తన ఉద్యోగానికి ఎక్కడ ఎసరు వస్తుందోనని సాక్ష్యం చెప్పొందంటూ సదరు అధికారి.. అద్దె బస్సుల యజమానుల సంఘం నాయకులతో మధ్యవర్తిత్వం జరిపారు. ఇదిలా ఉండగా వరంగల్ రీజియన్ కార్యాలయంలోని నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఆర్ఎం వరకు అధికారులు, ఉద్యోగులు తనకు సహకరించడం లేదంటూ సదరు అధికారి వారిపై ఆగ్రహావేశాలు వెళ్లగక్కుతున్నారని ఉద్యోగ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. కార్యాలయం అధికారులు, ఉద్యోగులతో అకౌంట్స్ విభాగం ప్రధాన అధికారి ఉప్పు నిప్పు అన్నట్లు ప్రవర్తిస్తోందని పేరు చెప్పడానికి ముందుకు రాని ఓ అధికారి తెలిపారు. విచారణ ఎవరు చేస్తున్నారో ఆ అధికారుల పేరు చెప్పడానికి కూడా ఏ ఒక్క అధికారి సాహసించడం లేదంటే ఆ అధికారి వ్యవహార శైలి ఏ మేరకు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. విచారణ అధికారుల వివరాలు గుట్టుగా ఉంచడంలో ఏదైనా అంతర్యం దాగి ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ అధికారులను కూడా ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు ఇప్పటి వరకూ వరంగల్ రీజియన్‌కు వచ్చి విచారణ చేపట్టలేదని తెలిసింది. అయితే అద్దె బస్సుల యజమానులకు డిపో స్థాయి అధికారి ద్వారా కరీంనగర్‌లోని కార్యాలయానికి విచారణకు రావాలని నోటీసులు పంపినట్లు ప్రచారం జరుగుతుంది. అద్దె బస్సుల యజమానులు మాత్రం తమకు నోటీసులు అందలేదని చెప్తున్నారు. ఇదిలా ఉండగా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ వద్ద కూడా పర్సంటేజీలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, విచారణ జరపాలని పలువురు కోరారు.

**బకాయిలు చెల్లించకుండా ముప్పతిప్పలు..**

హనుమకొండ–కరీంనగర్ మధ్య తిరిగే రెండు బస్సులు, హనుమకొండ–వేములవాడ మధ్య తిరిగే రెండు బస్సులు నిర్ణీత కిలో మీటర్ల కంటే తక్కువ కిలో మీటర్లకు ఆర్టీసీ అద్దె చెల్లించింది. దీనిపై అద్దె బస్సుల యజమానులు కోర్టుకు వెళ్లగా సర్వే చేసి వాస్తవ దూరం లెక్కించి బకాయిలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్న ఈ అధికారి వారికి బకాయిలు చెల్లించకుండా కార్యాలయం చుట్టు తిప్పుకుంది. బకాయిలు పెద్ద మొత్తం చెల్లించాల్సి రావడంతో పర్సంటేజీ తీసుకోవాలనే ఆలోచనతో కాలయాపన చేస్తూ వచ్చింది. తిరిగి తిరిగి వేసారిన అద్దె బస్సుల యజమానులు చివరకు పర్సంటేజీలు ముట్టజెప్పేందుకు ముందుకు వచ్చారు. 2016లో వారికి రావాల్సిన బకాయిల సొమ్మును రాబట్టుకునేందుకు రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు తీసుకుందని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి అద్దె బస్సుల యజమానులు పర్సంటేజీలు ముట్టజెప్పి చెక్కులు తీసుకున్నారు.

# నిరుద్యోగులు తల్లిదండ్రులకు భారం కావొద్దు

- రాష్ట్ర మంత్రి సీతక్క
- ఇంచర్లలో మెగాజాబ్ మేళా
- 1500 మంది ఎంపిక


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: నిరుద్యోగులు తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశంతో మెగా జాబ్ మేళా నిర్వహించామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం ములుగు మండలం ఇంచర్ల పంచాయతీ పరిధిలోని ఎంఆర్ గార్డెన్‌లో మెగాజాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 52 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ జాబ్ మేళాలో 1500 మంది ఎంపిక కాగా వారికి నియామక పత్రాలు అందించారు. జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడారు. జాబ్ మేళాలో ఉద్యోగం సాధించిన ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి పేరు తెచ్చుకోవాలన్నారు. ములుగు జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ టీఎస్ దివాకర్ మాట్లాడుతూ ఉద్యోగం ఏదైనా ఇష్టపడి చేయాలన్నారు. అప్పుడే అవకాశాలు వాటంతట అవే వస్తాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జాబ్ మేళా నిర్వహించిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

- తీర్పు వెలువరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్ : గంజాయి పట్టివేత కేసులో ఇద్దరు నేరస్తులకు ఒక్కొక్కరికి పది సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ బుధవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2022 మార్చి 9వ తేదీన అప్పటి కేసముద్రం ఎస్సై కె.తిరుపతి తమ పోలీసు స్టేషన్ పరిధిలోని కల్వల క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు రెండు సంచులతో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆపి విచారించారు. వారి వద్దగల సంచుల్లో 17 కిలోల 100 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నెక్కొండ మండలం బొల్లికొండకు చెందిన గుగులోత్ నిజ్జు, కేసముద్రం మండలం బోడమంచ్య తండాకు చెందిన భూక్యా చంటిగా గుర్తించారు. ఎస్సై తిరుపతి కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ సీఐ ఎస్.రవికుమార్ విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి, హెడ్ కానిస్టేబుల్ దేవనాయక్.. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. వాదోపవాదాలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ ఇద్దరు నేరస్తులు ఒక్కొక్కరికి పది సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

# తండ్రే హంతకుడు..

**మియాపూర్ ఘటనలో నిందితుడు నరేశే..**

- హైదరాబాద్ మియాపూర్‌లో 7వ తేదీన బాలిక అదృశ్యం
- నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి కోరిక తీర్చాలని బలవంతం
- తల్లికి చెబుతానని అనడంతో కూతురిని కడతేర్చిన తండ్రి


నిందితుడు నరేశ్

మరిపెడ రూరల్ : కంచె చేనుమేస్తే.. కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కామపిచాయి అయ్యాడు. వావి వరుసలు మరిచాడు. పశువు కంటే హీనంగా ప్రవర్తించాడు. కోరిక తీర్చమని కన్న కూతురినే బలవంతం చేశాడు. దీనికి ప్రతిఘటించిన ఆ చిన్నారి విషయం తల్లికి చెబుతానని బెదిరించడంతో నరరూప రాక్షసుడు అయ్యాడు. జుట్టుపట్టి పొదల్లోకి తీసుకెళ్లి నేలకేసి కొట్టాడు. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. హైదరాబాద్ మియాపూర్‌లో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు, అక్కడి పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట పరిధిలోని లక్ష్మాతండాకు చెందిన బానోతు నరేశ్, శారద దంపతులు తమ ఇద్దరి పిల్లల తీసుకుని బతుకుదెరువు నిమిత్తం నెల రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ మియాపూర్ ప్రాంతంలోని నడిగడ్డతండాలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 7న తన కుమార్తె (12) సమీపంలోని షాపునకు వెళ్లి కనిపించకుండాపోయిందని నరేశ్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారం రోజుల తర్వాత 13వ తేదీన రాత్రి అదే మియాపూర్ ప్రాంతంలో కుళ్లిపోయిన బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అనంతరం విచారణ చేపట్టిన పోలీసులు.. బాలిక మృతికి తండ్రే కారణమని నిర్ధారించారు. నరేశ్ వ్యసనాలకు బానిసయ్యాడు. మద్యం సేవించడం, పోర్న్ వీడియోలు చూడడం అలవాటు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఎలాగైనా తన కోరిక తీర్చుకోవాలని ఈ నెల 7వ తేదీన తన కుమార్తెను నడిగడ్డ తండా సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అక్కడ కూతురితో అసభ్యకరంగా వ్యవహరిస్తూ తన కోరికను తీర్చాలని బలవంతం పెట్టాడు. తండ్రి కోరిక విని దిగ్భ్రాంతికి గురైన బాలిక ఒక్కసారిగా అరిచింది. ఇంటికి వెళ్లిన తర్వాత ఈ విషయం అమ్మకు చెబుతానని మరోసారి గట్టిగా అరిచింది. దీంతో పట్టరాని కోపంతో రగిలిపోయిన తండ్రి పొదల్లోకి తీసుకెళ్లి జుట్టు పట్టుకుని నేలకేసి కొట్టాడు. అనంతరం ముక్కు, నోరు మూసి కూతురిని హత్యచేశాడు. ఏమి తెలియనట్లు ఇంటికి వచ్చి కుమార్తె కనిపించడం లేదని, ఏమైందోనని భార్యకు చెప్పి అక్కడ రాద్ధాంతం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు.. తండ్రే హంతకుడు అని నిర్ధారణకు వచ్చారు. ఈ లోపే నరేశ్ నడిగడ్డతండాలోని ఓ పెద్ద మనిషి వద్దకు వచ్చి జరిగిన ఉదాంతమంతా చెప్పి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. కాగా, కన్న తండ్రే కసాయిగా మారి ఇంతటి దారుణానికి ఒడిగట్టిన నరరూప రాక్షసుడికి ఉరిశిక్ష విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కేటుగాళ్ల బరితెగింపు..

## సైబర్ నేరగాళ్ల నయా మోసం ..



- సిమ్‌కార్డు బ్లాక్ చేసి పూజారి ఖాతా నుంచి రూ.7.50 లక్షలు డ్రా
- లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ విభాగానికి బాధితుడి ఫిర్యాదు

కాజీపేట: సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు. రోజురోజుకూ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం, పోలీసు శాఖ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా తిప్పి కొడుతున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అమాయకులను ఏదో చోట.. ఏదో రకంగా బురిడీ కొట్టిస్తూ నట్టేట ముంచుతూనే ఉన్నారు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. కాజీపేటకు చెందిన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ.. సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసానికి గురయ్యాడు. తనకు ఏమాత్రం తెలియకుండానే రూ. 7.50 లక్షలను పోగొట్టుకుని లబోదిబోమంటుఉన్నాడు.

**మోసం జరిగిన తీరు ఇలా...**

సాంకేతికతను వినియోగించుకుని సైబర్ మోసగాళ్లు.. ప్రవీణ్‌కుమార్ శర్మ సెల్‌ఫోన్ సిమ్ కార్డును బ్లాక్ చేశారు. దీంతో సెల్‌ఫోన్ పని చేయలేదు. అప్పటికే పూజారి తల్లి గ్యాస్ పేలి మంటలు అంటుకోవడంతో హనుమకొండలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అదే సమయంలో పూజారి భార్య కూడా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరగా వైద్యులు అత్యవసర సర్జరీ చేశారు. అటు భార్య, ఇటు తల్లి ఆసుపత్రుల్లో ఉన్న పరిస్థితుల్లో సెల్‌ఫోన్ పనిచేయకపోవడాన్ని సీరియస్‌గా తీసుకోకుండా అవసరానికి పిల్లల ఫోన్లు ఉపయోగించాడు. సిమ్ బ్లాక్ చేసిన సైబర్ నేరగాళ్లు వెంటనే రంగంలోకి దిగి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1.70 లక్షలను ఇతర ఖాతాలకు మళ్లించారు. వెంటనే అదే బ్యాంకు అకౌంట్ నుంచి మోసగాళ్లే ఆన్‌లైన్ రుణం పొంది రూ. 5.80 లక్షలు కూడా కాజేశారు. ఇక్కడా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే.. దేశంలోనే ఓ పేరున్న బ్యాంకు ఎలాంటి గ్యారంటీలు, ష్యూరిటీ లేకుండా ఒకపూటలోనే పూజారికి అదీ ఆన్‌లైన్‌లో రుణం మంజూరు చేయడం అందరినీ విస్మయానికి గురి చేస్తుంది.

**సైబర్ క్రైమ్ విభాగానికి బాధితుడి ఫిర్యాదు..**

రెండు రోజుల తర్వాత బాధితుడు ప్రవీణ్‌కుమార్ శర్మ హైదరాబాద్, వరంగల్ నగరాల్లోని ఎయిర్ టెల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి సిమ్ కార్డు పనిచేసేలా చేసుకున్నారు. వెంటనే సెల్‌ఫోన్‌కు డబ్బు డ్రా చేసినట్లు వరుసగా మేసేజీలు రావడం ప్రారంభమైంది. రెండు రోజుల దాకా ఫోనే పనిచేయలేదు..డబ్బులు ఎప్పుడు డ్రా చేశాననే ఆవేదనలతో బ్యాంకుకు వెళ్లగా అధికారులు విషయాన్ని చెప్పి స్టేట్‌మెంట్ తీసి చేతిలో పెట్టడంతో బాధితుడు ఖంగుతిన్నారు. సిమ్‌కార్డు బ్లాక్‌చేసి కేటుగాళ్లు చేసిన మోసంపై సైబర్ క్రైమ్ విభాగానికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాడు.

### చేపలవలలో పాము పిల్లలు


వలలో చిక్కిన పాము పిల్లలను చూపుతున్న మత్స్యకార్మికుడు

వరంగల్ నగరంలోని పడమరకోట అగడ్త చెరువులో శుక్రవారం సాయంత్రం మత్స్య కార్మికులు వేసిన చేపల వలకు 12 పాముపిల్లలు చిక్కాయి. మొదట్లో మత్స్య కార్మికులు పాపర్లు అనుకున్నారు. కాటేసేందుకు సిద్ధపడుతుండగా నీటిలో ఉన్నప్పుడే కర్రతో కొట్టి చంపారు. బయటికి వచ్చాక చూస్తే ప్రమాదకరమైనవిగా గుర్తించారు.

- ఖిలా వరంగల్

### దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన 13 పరీక్ష కేంద్రాల్లో 2,901 మంది విద్యార్థులకు గాను 2,163 మంది హాజరు కాగా 738 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (యూఏఎస్‌సీ) పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ పట్టుబడి ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారన్నారు.

# పెళ్లయిన మూడు నెలలకే.. బలవన్మరణం

- నవవధువు ఆత్మహత్య
- అత్తింటి వారి వేధింపులే కారణం
- నల్లబెల్లిలో ఘటన


వైష్ణవి(ఫైల్)

నల్లబెల్లి: ఆమెకు పెళ్లయి మూడు నెలలు.. అప్పుడే భర్తతో పాటు అత్తారింటి వేధింపులు. ఆ వేధింపులు భరించలేక ఓ నవ వధువు పుట్టింట్లో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వీర్ల రమేష్, రమ దంపతుల కుమార్తె వైష్ణవి(25)కి ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన పవన్ కుమార్(ప్రశాంత్)తో గత మార్చి 22న వివాహం జరిగింది. ఈ సమయంలో కట్నకానుకలు ముట్టజెప్పారు. పెళ్లి అయినప్పటి నుంచి వైష్ణవిని భర్త పట్టించుకునేవాడు కాదు. వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న పవన్‌కుమార్.. భార్యను పట్టించుకునేవాడు కాదు. ఈ విషయం తెలుసుకున్న వైష్ణవి భర్తను నిలదీసింది. అనంతరం తన అత్తామామ శారద, శంకర్, మరుదులు యోదన్ కుమార్, శ్రీనివాస్‌కు చెబుతూ తన గోడు వెళ్లబోసుకుంది. కాగా, వారందరు ఆమెను దూషించారు. చదువుకునే రోజుల్లో ఓ యువతిని ప్రేమించాడు.. ఆ విషయం మా అందరికీ తెలుసు. ఈ విషయం దాచిపెట్టి పెళ్లి చేశాం.. చూస్తూ ఊరుకోవాలి. ఎవరితో చెప్పొదని బెదిరించారు. కొన్ని రోజుల తరువాత వెంకటాపురం నుంచి భర్త ఉద్యోగం చేస్తున్న అనంతపురం వెళ్లి ఉంటున్నారు. అక్కడ ప్రేమించిన యువతితో ఉంటూ భార్యను పట్టించునేవాడు కాదు.. ఈ విషయంలో వైష్ణవితో తరుచూ గొడవపడుతూ అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేసేవాడు. ప్రేమించిన అమ్మాయితో ఇలాగే తిరుగుతానని నువ్వు చూస్తూ ఉండాలని తేల్చిచెప్పాడు. ఈ విషయం ఎవరికైనా చెప్పితే చంపుతానని, నీతో కాపురం చేయను, నీకు ఇష్టంలేకపోతే నీ తల్లిగారింటికి వెళ్లి చావు అంటూ భయభ్రాంతులకు గురిచేసి మంగళవారం ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న ఆమె జరిగిన విషయాన్ని విలపిస్తూ తల్లిదండ్రులకు చెప్పింది. ధైర్యంగా ఉండాలంటూ సర్దిచెప్పి ఇంట్లో నిద్రపోయారు. తెల్లవారుజామున లేచిచూడగా వైష్ణవి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని కొనఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. దీనిని గమనించిన తల్లిదండ్రులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతురాలి కుటుంబీకులను జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.



# ఖాకీ కామాంధుడు జైలుకు

- రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ‘సాక్షి’ కథనం
- కాళేశ్వరంలో మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై లైంగిక దాడికి పాల్పడిన ఎస్సైపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సర్కిల్ పరిధిలోని కాళేశ్వరం పోలీసు స్టేషన్‌లో ఎస్సై భవానీ సేన్.. అదే స్టేషన్‌లోని కానిస్టేబుల్‌పై లైంగికదాడికి పాల్పడిన ఘటనపై ‘ఖాకీచకుడు’ అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. పోలీసుశాఖకు ఆదేశాలు ఇవ్వడంతో సంబంధిత ఎస్సై భవానీ సేన్‌ను సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించినట్లు ఐజీ ఏవీ.రంగనాథ్ వెల్లడించారు.

**అర్ధరాత్రి పోలీసుల విచారణ**

మహిళా కానిస్టేబుల్‌పై లైంగికదాడి విషయం బయటకు పొక్కడంతో మంగళవారం రాత్రి పోలీసుల పహారాలో కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను విచారించడానికి కాటారం, భూపాలపల్లి, ఏఆర్ డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, 60 మంది పోలీసులు రంగంలోకి దిగారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు ఇన్వెస్టిగేషన్ అధికారిగా విచారణ చేపట్టారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు స్టేషన్‌లోని పోలీస్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను, అటెండర్లను విచారించారు. ఒక్కొక్కరి వాంగ్మూలం తీసుకున్నారు. అప్పటికే ఎస్సై రివాల్వర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఎటు వెళ్లకుండా సీఐ, ఎస్సైల పహారాలో ఉంచారు. బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేసి భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఎస్సైని విచారించారు. ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధిత మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను విచారించి వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం ఇరువురికి జిల్లా కేంద్రంలో వంద పడకల ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. మధ్యాహ్నం ఎస్సైని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కోర్టులో హాజరు పరచగా ఎస్సైకి 14 రోజులు రిమాండ్‌ను విధించారు. కరీంనగర్ జైలుకు తరలించారు.

**గతంలోనూ సస్పెన్షన్..**

ఎస్సై తీరు మారడం లేదు. ఎక్కడ పనిచేసిన మహిళలతో వంకర మాటలు మాట్లాడటం అతడి నైజంగా మారింది. గతంలో 2022 జూలైలో కుమ్రంభీం జిల్లా రెబ్బనలో ఎస్సైగా విధులు నిర్వర్తించే సమయంలో కానిస్టేబుల్ అభ్యర్థి ఓ యువతిని లైంగికంగా వేధించడంతో సస్పెన్షన్ వేటు వేశారు. ఆ సమయంలో భర్త సస్పెన్షన్ తట్టుకోలేక ఎస్సై భార్య వాసంతి శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా సంచలనంగా మారింది.

**ఉపేక్షించేది లేదు : మంత్రి దుద్దిళ్ల**


తప్పు చేస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మంథనిలో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఘటనపై స్పందించారు. చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

- లింగ్యా తండాలో ఘటన

కురవి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని బలపాల శివారు లింగ్యా తండాలో చోటు చేసుకుంది. కురవి ఎస్సై బి.గోపి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధరంసోత్ దేవా(48) కుటుంబ కలహాలతో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. అదే రోజు రాత్రి వర్షం కురుస్తుండగా భార్య ఇంటి తలుపు తీసి చూడగా దేవా ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై గోపి బుధవారం తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**తల్లిమందలించడంతో భూపతిపూర్‌లో బాలిక..**


నిఖిత (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: తరుచూ సెల్‌ఫోన్ చూస్తున్నావని తల్లి మందలించడంతో ఓ బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం తాడ్వాయి మండలం భూపతిపూర్‌లో జరిగింది. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోడెం నిఖిత(14) తాడ్వాయి కస్తూర్బాలో 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఇంట్లో తరుచూ సెల్‌ఫోన్ చూస్తుండడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన నిఖిత.. పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు అపస్మారక స్థితిలో ఉన్న నిఖితను ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంచి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.